విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 07 జూన్ 2024 8 పేజీలు

ఉద్యాన పంటల సాగుకు
ప్రభుత్వం చేయూత

- ఉపాధిహామీ పథకంలో సహకారం
- ఐదెకరాలలోపు రైతులకు అవకాశం

విశాలాంధ్ర-మార్కాపురం : ఉద్యానపంటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం చేయూతనందిస్తోంది. జిల్లాలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో వివిధరకాల పండ్ల తోటలు సాగవుతు న్నాయి. తూర్పున మామిడి, సపోట, జామ పంటలు సాగు అవుతుండగా, పశ్చిమాన బొప్పాయి. అరటి, నిమ్మ, బత్తాయి, దానిమ్మ పండ్ల తోటలను. రైతులు సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు ఇస్తూ లాభాలు వస్తుండటంతో పలువురు రైతులు పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. 12 ఏళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు పశ్చిమ ప్రకాశం బత్తాయిసాగులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేది. నీటి వసతి లేకపోవడంతో రైతులు బత్తాయి పంటలను వదిలి దానిమ్మ, బొప్పాయి, అరటి పంటలను బోర్లకింద సాగుచేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం కూడా సబ్సిడీపై పండ్ల మొక్కలను అందిస్తుండటంతో పండ్లతోటల సాగుపై రైతులు ఉత్సాహం చూపుతున్నారు.

జిల్లాలో సాగు ఇలా : జిల్లాలో మొత్తం 5 క్లస్టర్స్ ఉన్నాయి. బేస్తవారపేట, దర్శి, కనిగిరి, మార్కాపురం, ఒంగోలు క్లస్టర్స్ పరిధిలో 38 మండలాల్లో హార్టికల్చర్ విభాగం రైతులకు సేవలతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిస్తోంది. గిద్దలూరు నియోజకవర్గ పరిధిలో అర్ధవీడు, బేస్తవారపేట, కంభం, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల తర్లుపాడు మండలాల్లో మొత్తం ఈ ఆర్థిక సంవత్సరంలో 1550 ఎకరాల్లో పండ్ల మొక్కల ప్లాంటేషన్ జరగాల్సి ఉండగా ఇప్పటివరకు 60.3 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తైంది.

దర్శి క్లస్టర్ పరిధిలో : దర్శి క్లస్టర్ పరిధిలో దర్శి, కొనకనమిట్ల, కురిచేడు, మర్రిపూడి, ముండ్లమూరు, పొదిలి, తాళ్లూరు మండలాలు ఉన్నాయి. మొత్తం 1200 ఎకరాల్లో ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 27.95 ఎకరాల్లో ప్లాంటేషన్ చేశారు.

కనిగిరి క్లస్టర్లో : కనిగిరి క్లస్టర్లో సీఎస్ పురం, హనుమంతునిపాడు, కనిగిరి, పామూరు, లిపిసిపల్లి, పొన్నలూరు, వెలిగండ్ల మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1540 ఎకరాల్లో పండ్లతోటల ప్లాంటేషన్ లక్ష్యాన్ని నిర్ణయించగా ఆరెకరాల్లో చేశారు.

మార్కాపురం క్లస్టర్ పరిధిలో : మార్కాపురం క్లస్టర్ పరిధిలో దొనకొండ

మిగతా 2 లో ...

ఈవీఎంలు భద్రం

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో సంబంధిత ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఒంగోలు మామిడిపాలెంలో గల ఈవీఎం గోడౌన్‌లో భద్రపరచినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల లెక్కింపు ప్రక్రియ పూర్తి కావడంతో సంబంధిత ఈవిఎంలు, పోస్టల్ బ్యాలెట్లను ఒంగోలు మామిడిపాలెంలో గల ఈవిఎం గోదాములకు తరలించగా, గురువారం ఉదయం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్ మరియు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేయడం జరిగింది. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో జిల్లాలోని 8 నియోజక వర్గాలకు సంబంధించి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవిఎం మిషన్లను వేర్వేరుగా ఒంగోలు మామిడిపాలెంలో గల ఈవిఎం గోడౌన్‌లో పటిష్టమైన భద్రత మధ్య భద్రపరిచడం జరిగిందన్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్‌ను కూడా జిల్లా ట్రెజరీ స్ట్రాంగ్ రూముకు తరలించి భద్రపరచడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ ప్రక్రియలో తెలుగుదేశం పార్టీ ప్రతినిధి కాలేషా బేగ్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రసూల్, బిజెపి ప్రతినిధి రాజశేఖర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

562 మంది అరెస్ట్

- ఎన్నికల ప్రక్రియలో 79 కేసులు
- సుమారు రూ.6 కోట్ల విలువ చేసే ప్రాపర్టీ సీజ్
- సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బంది
- సహకరించిన మీడియాకు ధన్యవాదాలు
- ఉద్యోగుల కృషితో ఎన్నికలు విజయవంతం
- ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికల ప్రక్రియలలో జిల్లా వ్యాప్తంగా 79 కేసులు నమోదు చేసి 562 మందిని అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. గురువారం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఓట్ల లెక్కింపు ముగిసే వరకు మూడు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగించామన్నారు. పోలీస్ శాఖలో ఉన్న హోంగార్డు నుండి డీఎస్పీల వరకు ప్రతి ఒక్కరు నిష్పక్షపాతంగా, నిబద్ధతతో, సమర్థ వంతంగా విధులు నిర్వహించారన్నారు. అక్కడక్కడ చెదురుమొదురు ఘటనలు చోటు చేసుకున్నప్పటికీ త్వరితగతిన స్పందించి శాంతిభద్రతలను పరిరక్షించారన్నారు. సమాచారాన్ని ప్రజలకు చేరవేయ్యడంలో, ఏవైనా సమస్యలు ఉంటే వాటి గురించి సమాచారం పోలీస్ శాఖకు అందించడంలో మీడియా ప్రతినిధులు ఎంతగానో సహాయపడ్డారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఎస్పీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుండి జిల్లాలో శాంతి భద్రతలను నెలకొల్పటానికి

మిగతా 2 లో ...

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

కలెక్టర్ రంజిత్‌బాషా

విశాలాంధ్ర - బాపట్ల : ఉద్యోగుల సమిష్టి కృషి, జిల్లా ప్రజలు అందించిన సహకారంతో బాపట్ల జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలసి జిల్లా కలెక్టర్ పాత్రికేయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఒక పార్లమెంటు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియలను ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించమన్నారు. మార్చి 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలవడంతో అప్పటి నుండి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల నిబంధనలకనుగుణంగా 85 సంవత్సరాలు పైబడిన వృద్ధుల, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ నిర్వహించామన్నారు. తరువాత ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహించమన్నారు. అనంతరం ప్రధాన ఘట్టమైన పోలింగ్‌ను మే 13న ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించమన్నారు. జిల్లాలో ఎక్కడా రీపోలింగ్ అవసరం లేకుండా విజయవంతంగా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. చివరగా ఎన్నికల ప్రక్రియలో ముగింపు ఘట్టమైన కౌంటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేసి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇందుకు సహకరించిన పోలీస్ యంత్రాంగానికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రత్యేకంగా తమ వంతు సహాయ సహకారాలు అందించిన మీడియా వారికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి సంపూర్ణ సహకారంతో పోలీస్ శాఖలోని హోంగార్డు స్థాయి ఉద్యోగి నుండి ఏఎస్పి వరకు అందరి సమిష్టి కృషితో జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు పాల్గొన్నారు.

ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం
పాటుపడాలి
టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలుగుదేశం పార్టీ ఎంపీలు పనిచేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి జాతీయ కార్యాలయంలో టిడిపి ఎంపీలతో చంద్రబాబు నాయుడు గురువారం సమావేశం అయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలు ఏ లక్ష్యంతో అయితే పార్టీకి అధికారం కట్టబెట్టారు, వాటి ఆశలను నెరవేర్చాలని అన్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులు రాబట్టటంలో కీలకంగా వ్యవహరించాలన్నారు.

జనసేన, బిజెపి కార్యకర్తలను, నాయకులను కలుపుకొని క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. తనకోసం ఐదు సంవత్సరాలు పాటు కార్యకర్తలు, నాయకులు ప్రాణాలు ఫణంగా పెట్టి పని చేశారన్నారు. గొంతు మీద కత్తి పెట్టిన జై చంద్రబాబు అని నినదించారన్నారు. అటువంటి వారి బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు కష్టించి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డితో పాటు పలువురు ఎంపీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వామికి శుభాకాంక్షలు
ఎంపీటీసీ రామాంజనేయులు

విశాలాంధ్ర-పొన్నలూరు : ఉమ్మడి అభ్యర్థిగా విజయం సాధించిన డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామిని గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపిన కే అగ్రహారం గ్రామము టిడిపి నాయకులు. నాయుడుపాలెం తన నివాసంలో కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె అగ్రహారం సర్పంచి షేక్ చిన్న మస్తాన్ వంగపాటి ప్రసాద్ మాజీ కోఆప్షన్ సభ్యుడు భాష, వంగపాటి బాలాజీ ప్రకాష్ పాల్గొన్నారు.

562 మంది అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్న ముందస్తు చర్యల్లో భాగంగా 532 కేసులలో 4253 మందిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుండి రూ.1,74,13,812, రూ.56,39,813 విలువ కలిగిన 28,396 లీటర్ల మద్యాన్ని, రూ.67,16,492 విలువ కలిగిన 934.45 గ్రాముల బంగారాన్ని, రూ.3,75,448 విలువ కలిగిన 4.2 కేజీల వెండి, రూ.3,00,54,912 విలువ కలిగిన వాహనాలను, ఉచిత పంపకాలు చేసే వస్తువులను సీజ్ చేశామన్నారు. మొత్తం రూ.5,99,94,577 విలువ కలిగిన నగదు, మద్యం, వాహనాలను ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. ఎన్నికల ముందు, ఎన్నికల రోజు, ఎన్నికల తరువాత ఘర్షణలకు పాల్పడిన వారిపై మొత్తం 79 కేసులు నమోదు చేసి 562 మందిని అరెస్ట్ చెయ్యడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడిన వారిపై 19 కేసులు నమోదు చేసి 30 మందిని అరెస్ట్ చెయ్యడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

మద్యం మత్తులో లైన్‌మెన్ వీరంగం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ప్రజలకు సక్రమమైనటువంటి తమ శాఖ ద్వారా సేవలందించవలసినటువంటి ప్రభుత్వ అధికారి మద్యం మత్తులో నాలుగు చక్రాల వాహనంతో మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్ నందు వీరంగం సృష్టించాడు. స్థానికుల తెలిపిన వివరాలు ప్రకారం మద్దిపాడు మండలం విద్యుత్ శాఖ నందు మండల పరిధిలోని ఇనమనమెళ్ళురు సచివాలయము నందు ఎ.సీతారామ్ అను వ్యక్తి విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో విపరీతంగా మద్యం సేవించి మద్దిపాడు ఎన్ హెచ్ 16 సర్వీస్ రోడ్ నందు కారు నడుపుతూ ముందు, ఎదురు వచ్చే వాహనదారులపై కారుని అప్రమత్తంగా నడుపుతూ భయాందోళనకు గురి చేయడం జరిగింది. స్థానిక కొప్పాలు సెంటర్ వద్ద టైలర్ షాప్ వద్దకు అర్థ నగ్నంగా వెళ్లి తనకు బట్టలు కుట్టాలని కొలతలు తీసుకోమని ఇబ్బంది పెట్టడం జరిగింది. ప్రభుత్వ అధికారుల అయ్యుండి మద్యం మత్తులో వాహనం నడపటం ఒక తప్పైతే, కారును అతివేగంగా నడుపుతూ దూసుకెల్లడం మరో తప్పని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ అధికారి అయిఉండి కూడా ఈ విధంగా చేయటం ఏమిటని? అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ సంఘటనపై స్థానిక ఎస్సై వి మహేష్‌కు స్థానికుల సమాచారం అందించడంతో చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియపరిచారు.

విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : గ్రంథాలయాలు పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులు మేధాశక్తి పెరుగుతుందని దోర్నాల అది విశాఖ అధికారి విశ్వేశ్వరరావు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన దోర్నాలలోని విద్యార్థులు ప్రాథమిక వేసవి విజ్ఞాన శిబిరం క్లాసులను స్థానిక గ్రంథాలయంలో గ్రంథ పాలకుడు వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేసవి శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దోర్నాల అధికారి విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు వి.నాగమూర్తి, మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని తెలియజేశారు. వీరందరూ విద్యార్థినీ విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో వాళ్ళు నేర్చుకున్న వాటి గురించి వారు గ్రంథాలయంలో మంచి మంచి పుస్తకాలు ఉన్నాయి కాబట్టి ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడము చాలా మంచిది అని, విద్యార్థినీ విద్యార్థులకు వేసవిలో ఎండలకు తిరగకుండా ఇలాంటి కార్యక్రమము ఏర్పాటు చేసినందుకు గ్రంథాలయ సంస్థకు వారు ధన్యవాదాలు తెలిపారు. తదుపరి విద్యార్థిని విద్యార్థులకు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు వారి చేతుల మీదుగా బహుకరించడమైనది. మొత్తము విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో 30 మంది పాల్గొనడం జరిగింది. ఇంకా ఎక్కువమంది విద్యార్థిని విద్యార్థులు గ్రంథాల యాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

9న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్- 7

విశాలాంధ్ర - ఒంగోలు: అత్యంత ప్రేక్షకాదరణ పొందిన జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా 6 సీజన్లు పూర్తిచేసుకున్న జి తెలుగు డ్రామా జూనియర్స్ 7వ సీజన్ ఈ నెల 9న, సాయం 6:00 గంటలకు! ప్రతి ఆదివారం రాత్రి 9:00 గంటలకు ప్రసారమవుతుందన్నారు. భావోద్వేగం నిండిన కథతో ప్రేక్షకుల హృదయాలను తాకే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ మేఘసందేశం ఈ నెల 10 నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7:30 గంటలకు ప్రసారం కానున్నదన్నారు. కొన్నేళ్లుగా అందరి హృదయాలను గెలుచుకున్న పాపులర్ కిడ్స్ రియాలిటీ షో ఏడో సీజన్ కోసం తెలుగు బుల్లితెరపైకి రీఎంట్రీ ఇస్తోందన్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ 7కు కూడా సీనియర్ నటి జయప్రద జడ్జిగా కొనసాగనున్నారన్నారు. టాలీవుడ్ కమెడియన్, దర్శకుడు బలగం వేణు, అందాల నటి పూర్ణ కూడా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నా రన్నారు. చిన్న పిల్లలను కళాకారులుగా ఎదగడానికి, ప్రేక్షకులను అలరించడానికి జీ తెలుగు అద్భుత అవకాశాన్ని అందిస్తోందన్నారు. ఇక ఈ సీజన్ కి ప్రముఖ నటుడు, నిర్మాత శ్రీరామ్ వెంకట్ వ్యాఖ్యాతగా, పడమటి సంధ్యారాగం సీరియల్ అధ్య, రామలక్ష్మి మెంటర్స్‌గా వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వం చేయూత

(మొదటిపేజీ తరువాయి)

దోర్నాల మార్కాపురం, పెద్దారవీడు, పుల్లల చెరువు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం మండలాలు ఉన్నాయి. మొత్తం 1650 ఎకరాల్లో పండ్ల మొక్కల ప్లాంటేషన్ను గానూ 40 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తైంది.

ఒంగోలు క్లస్టర్ పరిధిలో : ఒంగోలు క్లస్టర్ పరిధిలో చీమకుర్తి, కొండెపి, కొత్తపట్నం, మద్దిపాడు. నాగులుప్పలపాడు, ఒంగోలు, సంతనూతలపాడు, శింగరాయకొండ, టంగుటూరు, జరుగుమిల్లి మండలాలు ఉన్నాయి. ఇందులో 1060 ఎకరాలకు గానూ 12 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తైంది. పండ్ల తోటల్లో ప్రముఖంగా తైవాన్ జామ, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, చీనీ, నిమ్మ, మామిడి, జీడిమామిడి తదితర పండ్ల తోటలు సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో కొన్ని పంటలకు మూడేళ్ల వరకూ నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం అందిస్తోంది. ఎకరాకు మూడేళ్లకు సగటున లక్ష రూపాయల వరకూ ప్రభుత్వం ప్రోత్సాహంగా ఇస్తుంది.

ఈ పంటలకు ప్రోత్సాహం : పండ్ల తోటల్లో ప్రముఖంగా తైవాన్ జామ, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, చీనీ, నిమ్మ, మామిడి, జీడిమామిడి తదితర పండ్ల తోటలు సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో కొన్ని పంటలకు మూడేళ్ల వరకూ నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం అందిస్తోంది. ఎకరాకు మూడేళ్లకు సగటున లక్ష రూపాయల వరకూ ప్రభుత్వం ప్రోత్సాహంగా ఇస్తుంది.

ఉపాధి హామీ పథకం వర్తింపు : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఉద్యానపంటల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ప్రధానంగా ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ సహాయం ఉండాలంటే రైతు ఖచ్చితంగా జాబ్కార్డు ఉండాలి. పొలం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్కార్డు నకలు అందించాలి. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉపాధి హామీ అధికారులు పరిశీలించి సబ్సిడీని అందిస్తారు. పండ్ల తోటల్లో ఉండాలంటే రైతు ఖచ్చితంగా జాబ్కార్డు ఉండాలి. పొలం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ కార్డు నకలు అందించాలి. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉపాధి హామీ అధికారులు పరిశీలించి సబ్సిడీని అందిస్తారు. పండ్ల తోటల్లో రైతులు చేసుకునే పనులకు ఈ పథకం ద్వారా బిల్లుల రూపంలో నగదు చెల్లిస్తారు.

పథకాన్ని ఉపయోగించుకోండి

- డాక్టర్ బి.అర్జునరావు, పీడీ, డ్వామా

ఉద్యాన పంటలు సాగుచేసే రైతులు ఉపాధిహామీ పథకం ద్వారా అందుతున్న ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకోవాలి. జిల్లాలో ఉద్యానపంటల సాగు కూడా పెరుగుతోంది. ప్లాంటేషన్స్ చేయిస్తున్నాము. ప్రభుత్వ నర్సరీల్లో కూడా మొక్కలు పెంచుతున్నాము. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఖరీఫ్ సీజన్ మొదలైనందున రైతులకు సాగుకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని వ్యవసాయ అధికారికి ఏపీ రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సకాలంలో వర్షాలు పడటం వలన రైతులు వ్యవసాయ పనులకు సిద్ధం అయ్యారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కంది, మినుము, సజ్జ, మొక్కజొన్న, మొదలగు విత్తనాలను పూర్తి రాయితీతో అందజేయాలన్నారు. మండలంలోని పోలవరం గ్రామ రెవిన్యూ పరిధిలో రైతులకు సకాలంలో విత్తనాలు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు గాలి వెంకటేశ్వర్లు, పంట ఏడుకొండలు కోరారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

ఎస్ఐ మాధవరావు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఎన్నికల ఫలితాలు వెలువ వెలువడిన నేపథ్యంలో గ్రామంలో గొడవలు ఘర్షణ జరగకుండా ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఎస్సై మాధవరావు తెలిపారు. గురువారం మండలంలోని పెదారికట్ల గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించిన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన, వారిపై నిఘా ఉంటుందని ఎస్ఐ గ్రామ ప్రజలకు వివరించారు.

డీలర్ విధులకు రాజీనామా

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని బల్లవరం గ్రామానికి నర్సమందాపురం గ్రామానికి చెందిన 17వ నెంబర్ డీలర్ షాపుకి స్వచ్ఛం దంగా గురువారం రాజీనామా పత్రాన్ని ఎమ్మార్వో డానియల్‌కి అందజేశారు. ఈ క్రమంలో చిలకల నారాయణ మాట్లాడుతూ నా వ్యక్తిగత కారణాలవల్ల నేను డీలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇకపై ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పౌరసరఫరాలను ప్రభుత్వం వారు నిర్ణయించిన వ్యక్తి ద్వారా పొందాలని ఆ గ్రామ ప్రజలకు తెలిపారు.

పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేయాలి

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడ నున్న నూతన ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్లు, కార్మికుల సంక్షేమం కోసం అన్నివిధాలా కృషి చేస్తారని ఆంధ్రా పెన్షనర్ పార్టీ అధ్యక్షులు పాలంకి సుబ్బారాయన్ తెలిపారు రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు నాయకత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడబోతున్న గురువారం ఆయన నాయకత్వంలో ఆనందోత్సాహాల మధ్య రాష్ట్ర సెక్రటేరియట్ ఉద్యోగులతో కలిసి ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ పెద్ద వేడుక నిర్వహిం చారు. చంద్ర బాబు నాయుడు ను అభినందిస్తూ ఉద్యోగులంతా ఒకరి నొకరు హత్తుకుంటూ అలింగనలు చేసుకోంటూ,మిఠాయిలు తినిపించు కోంటూ పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు ఉద్యోగ సంఘ నాయకులందరూ తమ ఓటు హక్కుతో ప్రజావ్యతిరేక ప్రభుత్వం అయిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చేప్పారన్నారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉంది.

దుర్గాఘాట్‌లో షెడ్డుకు నల్లరంగు-అర్చకుల ఆగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కృష్ణ నది తీరాన పిండ ప్రధానల సమయం లో ఎండ , వానలకు పురోహితులు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశం తో వెల్లంపల్లి ఫౌండేషన్ ద్వారా శాశ్వత షెడ్ ను ఏర్పాటు చేశామని ఫౌండేషన్ డైరెక్టర్ కొనకళ్ల విద్యాధరరావు తెలిపారు ఆ పేరు పై గుర్తుతెలియని వ్యక్తులు షెడ్డుకు నల్లరుంగు పోశారని చెప్పారు. . నల్ల రంగు పులమటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు . ఈ పని చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . కృష్ణ నది తీరాన పిండ ప్రధానాలు చేసే ఘాట్ లో వెల్లంపల్లి ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన షెడ్ పై ఉన్న బోర్డు పై నల్ల రంగు పూలమటం ను కృష్ణ నదీ పురోహిత సంఘం సభ్యులు ఖండించారు . ఈ సందర్భంగా కృష్ణానది పురోహిత సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకప్పుడు దుర్గ ఘాట్ పిండ ప్రదానాలు చేసేవాళ్లమని . ఘాట్ లో పిండ ప్రధానాలు చేసే సమయంలో ఎండ వాన లకు తీవ్ర ఇబ్బందులు పడే వాళ్ళమని చెప్పారు . ఆ ఇబ్బందులు అప్పటి శాసన సభ్యులు వెల్లంపల్లి శ్రీనివాస్ దృష్టి కి తీసుకుని వెళ్ళగా వెంటనే స్పందించిన ఆయన తమ సమస్యల కు శాశ్వత పరిష్కారం చూపుతూ వెల్లంపల్లి ఫౌండేషన్ ద్వారా శాశ్వత షెడ్ ను ఏర్పాటు చేశారని చెప్పారు . రాజకీయ పార్టీ లతో తమకు ఎటువంటి సంబంధం లేదని . సేవా కార్యక్రమాల పై ఇలాంటి ఘటలకు పాల్పడటం సరైనది కాదని వెల్లడించారు. అనంతరం వెల్లంపల్లి ఫౌండేషన్ డైరెక్టర్ కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ కృష్ణా నది తీరాన పిండ ప్రధానాలు చేసేందుకు గతంలో వెల్లంపల్లి ఫౌండేషన్ ద్వారా కృష్ణ నది తీరాన ఒక షెడ్ ఏర్పాటు చేయటం జరిగిందనీ చెప్పారు . ఇవే కాక ఫౌండేషన్ ద్వారా రాజకీయాలకు , కుల మతాలకు అతీతంగా అనేక సేవా కార్యక్రమాలు చేసినట్లు గుర్తు చేశారు. తల్లిదండ్రులకు కర్మ కాండలు చేసేందుకు దేశ వ్యాప్తం గా హిందువులు కృష్ణ నది తీరానికి చేరుకుంటారనీ అలాంటి ప్రదేశం లో షెడ్ నిర్మాణం చేశామని తెలిపారు. ఎవరెన్ని ఆకృత్యాలు చేసిన తాము నిర్వహించే సేవా కార్యక్రమాలు ఆగవనీ స్పష్టం చేశారు .ఇలాంటి విషయాన్ని ప్రజలు కూడా తీవ్రంగా ఖండించాలనీ కోరారు. ఈ పని చేసిన వారిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. సేవా సంస్థల మీద తిరుగుబాటు ను ఖండిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈఘటన పై విజయవాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

16న సివిల్స్ ప్రిలిమ్స్‌కు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈ నెల 16న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2024కు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. యూపీఎస్సీ ఈ నెల 16న దేశ వ్యాప్తంగా సివిల్స్ ప్రిలిమ్స్ నిర్వహించనున్న నేపథ్యంలో యూపీఎస్సీ అధికారులు.. పరీక్షా కేంద్రాలున్న జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. అత్యంత ప్రతిష్టాత్మక సివిల్స్ ప్రిలిమ్స్‌ను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై యూపీఎస్సీ అధికారులు మార్గనిర్దేశనం చేశారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖపట్నం, అనంతపురం, తిరుపతితో పాటు విజయవాడలో సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష జరగనుందని.. ఈ నేపథ్యంలో విజయవాడలో పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16న ఉదయం 9.30 గం. నుంచి 11.30 గం. వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గం. నుంచి 4.30 గం. వరకు పేపర్-2 పరీక్ష జరగనుందని.. విజయవాడలో 25 కేంద్రాల్లో 11,112 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు రూట్ అధికారులు, సూపర్‌వైజర్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బంది తదితరులను నియమించినట్లు వెల్లడించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఏపీఎస్ఆర్‌టీసీ, మునిసిపల్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో పరీక్షను విజయవంతంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. డీఆర్‌వో వి.శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

సచివాలయ మహిళా ఉద్యోగిపై గొడ్డలితో దాడి

విశాలాంధ్ర-వీరులపాడు: రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ఓడిపోవడానికి ఉద్యోగస్తులే కారణమని, ఓటు వేయలేదనే అక్కసుతో గొడ్డలితో దాడికి ప్రయత్నించిన ఘటన వీరులపాడు మండలం చెన్నారావుపాలెం గ్రామ సచివాలయంలో జరిగినది. మండల పరిధిలోని చెన్నారావుపాలెం గ్రామంలో పంచాయతీ సెక్రెటరీగా పనిచేస్తున్న షేక్ జుబేదాపై అదే గ్రామానికి చెందిన విజయరావు అనే వ్యక్తి భోజనం చేస్తున్న సచివాలయ సిబ్బందిపై పెద్దపెద్దగా అరుస్తూ భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తిస్తూ కార్యాలయంలోకి గొడ్డలితో దాడి చేయగా, గొడ్డలి వేటు తృటిలో తప్పి గొడ్డలి తిరగబడి మెడ మీదుగా తగిలినది. దీంతో ప్రాణాపాయం తప్పింది. ఆ సమయంలో బయటికి వెళ్లకుండా అడ్డుపడిన విజయరావును ప్రాణభయంతో బలవంతంగా అతన్ని నెట్టి బయటపడి ప్రాణాలు కాపాడుకున్నాం అని జుబేదా తెలిపారు.గొడ్డలితో దాడి చెయ్యటమే కాకుండా తన సహ ఉద్యోగినిలపై అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె తెలిపినది. అనంతరం గ్రామస్తులే అడ్డుపడి కాపాడారని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహాలక్ష్మిడు తెలిపారు.

నేటి నుంచి ఇగ్నో పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):

ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే జూన్ 2024 టర్మ్ ఎండ్ పరీక్షలు జూన్ 7వతేదీన నుండి జులై 15వతేదీ వరకు జరుగుతాయని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ డి.ఆర్.శర్మ గురువారం పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతీయకేంద్రం పరిధిలో 6 పరీక్షా కేంద్రాలను విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, అనంతపురం లలో ఏర్పాటు చేసామన్నారు. అర్హులైన అభ్యర్థులందరికీ హాల్ టికెట్స్ ను ఇగ్నో వెబ్ సైట్ నందు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్స్ ని ఇగ్నో విశ్వవిద్యాలయపు వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు.

పంటలకు ఊపిరి పోసిన వర్షం

విశాలాంధ-కూచిపూడి : మొవ్వ మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకుఉరుములు పిడుగులు,తో పాటు విస్తృతమైన గాలులతో కురిసిన వర్షం తో మెట్టపైరులకు ఊపిరి ఇచ్చింది. రోహిణి కార్తె లో భారీగా కురిసిన వర్షం15.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ప్రస్తుతం మెట్టపొలాలలో సాగవుతున్న కూరగాయల తోటలు కు ఈ వర్షం మంచిదేనని పలువురు రైతులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పుడిప్పుడే మొక్కపెరుగుతూ తీగలు వేస్తూన్న బీర తోటలకు కొంత ఇబ్బందికరమేనని పేర్కొంటూ రైతులు పైపుల ద్వారా నీటిని బయటకు తీసుకున్నారు. గత నెల 25వ తారీకు ప్రారంభమైన రోహిణి కార్తె లో కురుస్తున్న వర్షాలతో పలువురురైతులు వరి విత్తనాలనువెదజల్లుకోవటం ప్రారంభించారు, అలాగేకొంతమంది రైతులు వరినారుమడులు పోసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగానే ఉంటుందని పలువురు రైతులుపేర్కొంటున్నారు. ఈ వర్షంమూలంగా రోడ్డుపై గోతులలో నీరు నిలిచి రహదారులు ఇబ్బందికరంగా మారాయి. కూచిపూడి, పెదపూడి, యద్దనపూడి, పెడసనగల్లు, భట్లపెనుమర్రు, మొవ్వ, కాజ, కారకంపాడు నుంచిపెదముత్తేవి, తదితర రహదారులపై గల గోతులు వాహనదారులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి.

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన పాకల విద్యార్థులు

విశాలాంధ్ర-సింగరాయకొండ : మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వి.ఎస్ ప్రసాద్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో జరిగిన ఉపకార వేతన అర్హత పరీక్షలో పాఠశాలకు చెందిన కె.గాయత్రి ప్రియ, కె ప్రణవ్ గౌతమ్‌లు ప్రతిభను చూపి జాతీయ ఉపకార వేతనమునకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి సంవత్సరమునకు 12000 రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా ఉపకార వేతనం అందుతుంది. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది ఎస్ఎంసి చైర్మన్ మాధవరావు అభినందనలు తెలిపారు

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కలిసిన దోర్నాల టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : శ్రీశైలం టిడిపి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గురువారం శ్రీశైలం వెళ్తుండగా మార్గమధ్యలో నటరాజ్ సెంటర్ నందు దోర్నాల టిడిపి మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జునరెడ్డి మరియు బట్టు సుధాకర్‌రెడ్డి, కొప్పుల వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక నటరాజ్ సెంటర్ నందు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌ను పూల మాలలతో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పార్టీ మంచి విజయాన్ని సాధించిందని తెలిపారు. టిడిపి నాయకులు, దొడ్డ శేషాద్రి, దేసు నాగేంద్రబాబు, రావి క్రింది సుబ్బరత్నం, షేక్ ఇస్మాయిల్, విష్ణువర్ధన్‌రెడ్డి మరియు జనసేన నాయకులు పందు, టిడిపి నాయకులు పవన్, తదితరులు అతనిని సన్మానించారు.

పాఠశాల ప్రచార కరపత్రం ఆవిష్కరణ

ఎంఈఓ. సుజాత

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ల ప్రచార కరపత్రాన్ని మండల విద్యాశాఖ అధికారిని దేవరకొండ సుజాత ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ఉన్నత విద్యార్హతలు కలిగిన, బోధనా అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను గురించి విద్యార్థుల తల్లితండ్రులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలి, సహ ఉపాధ్యాయులు షేక్ షెక్షావలి పాల్గొన్నారు.

బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర-దర్శి : దర్శి గ్రంథాలయం శాఖలో గురువారం చివరి రోజు వేసవి విజ్ఞాన శిబిరాలు మే నెల 15తేదీ నుండి జూన్ 6వ తేదీ గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో 20 రోజులు విద్యార్థిని విద్యార్థులకు ప్రతిరోజు నీతి కథలు చెప్పడం, కథలు రాయడం, పద్యాలు, గణితంలో మెలకువలు, క్యారం బోర్డు, లూడో, క్రికెట్, చదరంగం, స్కిప్పింగ్, ఆటలు పాటలు ఆటలు పాటలు మొదలగు వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు జూనియర్ కాలేజీ లెక్చరర్ వివి సుబ్బయ్య, టీచర్ ఆదిలక్ష్మి, జూపల్లి కోటేశ్వరరావు, సంఘ సేవకులు జీవీ రత్నం, యుటిఎఫ్ నాయకుడు శ్రీనివాస్, గవర్నమెంట్ రిటైర్డ్ టీచర్ రామారావు, బీడీసీఎల్ వి కోటయ్య, చెంచులింగం, బి గోపి, కే నాగార్జునరెడ్డి విద్యార్థిని విద్యార్థులకు వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానము చేశారు. 35మంది విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

విశాలాంధ్ర-కనిగిరి : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రకాశం జిల్లా అభ్యాస వర్గ కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన దీర్ఘకాలిక ఆర్థిక బకాయిలపై నూతన ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాలాజీ మాట్లాడుతూ విద్యకు ప్రతిబంధకంగా మారిన జీవో 117 రద్దు చేయాలని, నూతన ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘ కార్యకర్తలు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, డిఈఓ పూల్‌లో పండితుల పోస్టులు అప్డేట్ చేయాలని, 2003 డిఎస్సి వారికి పాత పెన్షన్ స్కీం వర్తింపచేయాలని, మెగా డీఎస్సీ వీలైనంత త్వరలో ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఆపస్ ముందుంటుందని, జిల్లాలోని ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ పూర్తిచేసిన డిఈఓకి అభినందనలు తెలియజేశారు. జిల్లా గౌరవ సలహాదారు కె.వీరాచారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాజిటివ్ దృక్పథంతో ఉండాలని, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడంలో సహాయకారులుగా పని చేయాలని కోరారు. ఆపస్ ద్వారా సాధించబడిన ఏకీకృత సర్వీసు రూల్స్ ఫలాలను ఉపాధ్యాయులకు అందించాలని, సిపిఎస్ రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని, ఈహెచ్ఎస్ పథకాన్ని సరిచేసి సక్రమంగా వినియోగంలోకి తేవాలని, ఏపీ జిఎల్ఐ మిస్సింగ్ క్రెడిట్‌లను గత షెడ్యూల్ ఆధారంగా వారే పరిష్కరించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభారి కే వెంకటేశ్వర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కే ప్రకాష్, కె మాధవ శర్మ, జిల్లా బాధ్యులు కే శంకర్రావు, బివిఎస్ గుణ ప్రసాద్ వై కోటేశ్వరరావు కే నరసింహ యం.ఎన్.కే శర్మ, వి.మార్కండేయులు శంకర్, ఆర్. పవన్ కుమార్ జిల్లా, మండల శాఖల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక గ్రంథాలయం నందు విద్యార్థులకు గురువారం వేసవి శిక్షణ తరగతులు గ్రంథ పాలకుడు కే సత్యనారాయణ ఆధ్వర్యంలో చాలా చక్కగా జరుగుతున్న ఉచిత శిక్షణ తరగతులలో విద్యార్థిని విద్యార్థుల ద్వారా పాఠ్య పుస్తకాలు కథలు చెప్పించడం చదివించటం జరిగాయి. అలాగే ఈ శిక్షణలో విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలపై ఏనుగు బొమ్మను వేసి దాని అంశమును గురించి ఉపాధ్యాయులు జి సూర్య వివరించారు. జనరల్ నాలెడ్జి క్విజ్ పరీక్షలు పరంకుశం రామకృష్ణ ప్రత్యేక క్లాసులు తీసుకొని బోధనలు చేశారు.

మండలంలో పోలైన ఓట్ల వివరాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మంగళవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో ముండ్లమూరు మండలంలో గ్రామాల వారీగా అభ్యర్థులు సాధించిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. కె ల్లంపల్లి టిడిపికి1016 రాగా వైసిపికి918 ఓట్లు వచ్చాయి టిడిపి కి 98 మెజారిటీ, పులిపాడు వైసిపి1297 టిడిపి980 వైసిపి కి 317 మెజారిటీ, బసవాపురంలో టిడిపి 495 వైసిపి 290 టిడిపి మెజారిటీ 205, పెద్దవుల్లగల్లు వైసిపి 1663 టిడిపి1438 మెజారిటీ 225 వైసీపీ, సింగనపాలెం టిడిపి 785 వైసిపి 547 మెజారిటీ 238 టిడిపి, పసుపుగల్లు వైసిపి1551 టిడిపి1314 మెజారిటీ 237 వైసిపి, వేముల బండ టిడిపి 527 వైసిపి 279 మెజారిటీ 248 టిడిపి, రమణారెడ్డి పాలెం టిడిపి 365 వైసిపి 231 మెజారిటీ 134 టీడీపీ, కమ్మవారిపాలెం వైసిపి 364 టిడిపి 299 మెజారిటీ 65 వైసీపీ, వేముల వైసిపి 972 టిడిపి 882 మెజారిటీ 90వైసీపీ, బొప్పూడి వారి పాలెం టిడిపి 638 వైసిపి 599 మెజారిటీ 39 టీడీపీ, ఈదర వైసిపి 1086 టిడిపి 825 మెజారిటీ 261 వైసీపీ, భీమవరం టిడిపి 710 వైసిపి4 74 మెజారిటీ 236 టిడిపి, ఉమామహేశ్వరపురం వైసిపి 1326 టిడిపి 1127 మెజారిటీ 199 వైసిపి, తమ్మలూరు వైసిపి 472 టిడిపి 374 మెజారిటీ 98 వైసీపీ, ముండ్లమూరు టిడిపి 1023 వైసిపి 883 మెజారిటీ 140 టిడిపి, వేంపాడు టిడిపి 695 వైసిపి 533 మెజారిటీ 162 టీడీపీ, నాయుడుపాలెం వైసిపి 623 టిడిపి 356 మెజారిటీ 267 వైసిపి, పెదరావిపాడు టిడిపి 351 వైసిపి 278 మెజారిటీ 73టిడిపి, మారెళ్ల వైసిపి 1685 టిడిపి 1332 మెజారిటీ 353 వైసిపి, పూరి మెట్ల వైసిపి 808 టిడిపి 787 మెజారిటీ 21 వైసీపీ, మక్కినేని వారి పాలెం టిడిపి 396 వైసిపి 340 మెజారిటీ 56 టిడిపి, జమ్ములమడక వైసిపి 386 టిడిపి 106 మెజారిటీ 280వైసిపి, తూర్పుకంభంపాడు టిడిపి 651 వైసిపి 466 మెజారిటీ 185 టిడిపి, సుంకర వారి పాలెం టిడిపి 401 వైసిపి 371 మెజారిటీ 30 టిడిపి, నూజిళ్లపల్లి టిడిపి 388 వైసిపి 339 మెజారిటీ 49 టిడిపి, శంకరాపురం టిడిపి 1163 వైసిపి 650 మెజారిటీ 513 టిడిపి, పోలవరం టిడిపి 1054 వైసిపి 951 మెజారిటీ 13 టిడిపి మొత్తం ఓట్లు 45625 కాగా పోలైనవి 42428 వైసీపీకి 20382 రాగ టిడిపికి 20478 వచ్చాయి. ముండ్లమూరు మండలంలో టిడిపికి 96 ఓట్లు మెజారిటీ వచ్చింది.

వలంటీర్ల మనోవేదన

- వైసీపీ నేతల ఒత్తిళ్లతో రాజీనామాలు
- ప్రభుత్వం మారటంతో మళ్లీ ఉద్యోగం కష్టమే

విశాలాంధ్ర-కనిగిరి : వాలంటీర్లకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసింది. ఎన్నికలకు ముందు రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేసింది. అలా చేస్తేనే అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్ళీ కొనసాగిస్తామని స్పష్టం చేసింది. రాజీనామా చేసిన వారే వాలంటీర్లు అంటూ వైసీపీ నాయకులు చెప్పుకొచ్చారు .దాంతో కనిగిరి నియోజకవర్గం లోని కనిగిరి, హనుమంతునిపాడు, వెలిగండ్ల, సిఎస్పురం, పామూరు, పీసీ పల్లి మండలాల్లో సుమారు 500 మంది పైగా వాలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. వారే లేకపోతే ఎన్నికలే లేవన్న పరిస్థితిలో వైసిపి నాయకులు ఉన్నారు. రాజీనామా చేసిన వాలంటీర్లను ఎంతగానో ఉపయోగించుకున్నారు తెలుస్తుంది. కార్యకర్తలను నిష్ఫరించి వాలంటీర్ వ్యవస్థను నమ్ముకున్న వైసీపీ నాయకులు వాలంటీర్లకు రెండు నెలలు గాను పదివేలు ఇచ్చారు. తీరా ఇప్పుడు తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది. రాజీనామా చేసిన వారిని మళ్లీ తీసుకుంటారా..? లేదా ..? అనివారంతా మదన పడుతున్నారు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రతి వాలంటీర్‌కు 10 వేలు ఇస్తామంటూ భరోసా ఇచ్చారు. రాజీనామా చేయవద్దని కోరారు. ఫలితంగా కొంతమంది రాజీనామా చేయలేదు. వారికి ప్రభుత్వమే వేతనము ఇచ్చింది. ఈ నెల వేతనం కూడా చెల్లించింది. రాజీనామా చేసిన వారే నష్టపోయారు. వైసీపీ నేతలు మాటలు విని రాజీనామా చేశారు. ఇప్పుడు వారిని కూటమి ప్రభుత్వం తీసుకునే అవకాశం లేదు. వైసీపీ నాయకులు మాట విని మోసపోయామంటే ఇప్పుడు రాజీనామా చేసిన వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం విధులకు మాత్రమే దూరంగా ఉండమని చెప్పింది. కోడ్ ఉన్నంతవరకే వర్తింప చేసింది. ఆ తర్వాత యధావిధిగా సేవలు కొనసాగించవచ్చని చెప్పింది. కానీ వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లను తప్పుదోవ పట్టించింది. కూటమి వల్లే విధులకు దూరమయ్యారని ప్రకటనలు చేసింది. ఇలా వైసీపీ నేతలు ఒత్తిడితో రాజీనామా చేసిన వారంతా వీధిన పడ్డారు.

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ వాహనాలు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులు తీర్చాలన్న లక్ష్యంతో లక్షల వ్యయంతో ప్రభుత్వం కొనుగోలు చేసిన వాహనాలు నేటి కాలానికి ఉప్పు పట్టి శిథిలావస్థకు చేరి నిరుప యోగంగా ప్రభుత్వ కార్యాలయాల ముందు దర్శన మిస్తున్నాయి. వేలాది కిలోమీటర్లు తిరిగి మరమ్మ తులకు గురికాగా పట్టించుకునేవారు లేక కార్యాలయ ప్రాంగణాల్లో అలంకారప్రాయంగా వాహనాలు ఉన్నాయి ,గతంలో తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ రాజ్, తదితర శాఖల డివిజనల్ అధికారుల వాహనాలు నడిపేందుకు ప్రత్యేకంగా డ్రైవర్లు ఉండేవారు కాలక్రమేనా డ్రైవర్ల నియామకం లేకపోవడంతో పాటు పాత వాహనా లను వాడేందుకు అధికారులు సైతం ఆసక్తి చూప డం లేదు దీంతో నిరాధారణకు గురై తుప్పుప ట్టాయి, లక్షల రూపాయలు వెచ్చించి కొన్న వాహనా లు నిరుపయోగంగా మారినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఆఫీస్ ,ప్రాంగణంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో, మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం గెస్ట్ హౌస్ ఆవరణలో, ఈ వాహనాలు చాలాకాలంగా నిరుపయోగంగా ఉండి తుప్పు పట్టి పోతున్నాయి ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాత వాహనాలను వేలం స్తే వార్లు పంపాలని ప్రభుత్వానికి కొంతైనా ఆదాయం జమ అయ్యే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని నక్కబొక్కలపాడు గ్రామంలోని విఘ్నేశ్వరుడు,పోలేరమ్మ, బొడ్రాయి (ప్రతిష్ఠించి 13 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా) 13వ వార్షికో త్సవం గురువారం అంగరంగ వైభవం గా నిర్వహించారు.వార్షికోత్సవం పుష్ప రించుకొని దేవాలయాలను ప్రత్యేక అ లంకరణలో తీర్చిదిద్దారు ఆలయ పూజా రులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విఘ్నేశ్వరుని పోలేరమ్మని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజ పాల్గొన్నారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజా సమస్యల పోరాటం చేద్దాం:కరణం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : గత ఐదు సంవత్సరాల నుండి అన్ని కార్యక్రమాల్లో తనతో ఉండి, సార్వత్రిక ఎన్నికల్లో చీరాల నియోజక వర్గంలో తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అని చీరాల నియోజక వర్గ వైకాపా అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. రామ కృష్ణాపురంలోని వైకాపా క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపు, ఓటములు సహజం అన్నారు. నూతనంగా ఏర్పడుతున్న ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామన్నారు. చీరాల నియోజక వర్గ ప్రజల మన్ననలను పొంది రానున్న ఎన్నికలలో చీరాల నియోజక వర్గం నుండే పోటీ చేసి విజయం సాధిస్తామనే విశ్వాసం వ్యక్తం చేశారు. బాపట్ల ఎంపీగా విజయం సాధించిన తెన్నేటి కృష్ణ ప్రసాద్‌కు, చీరాల శాసన సభ్యునిగా విజయం సాధించిన మద్దులూరి మాలకొండయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటే ఎంతో ప్రయోజనం చేకూర తుందని నిజాంపట్నం శాఖ గ్రంథాలయ అధికారిణి ఎస్. విజయలక్ష్మి తెలిపారు.వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యా ర్థులకు ఖోఖో, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతా యని చెప్పారు.విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వి నియోగం చేసుకుని మరింత పరిజ్ఞానం పెంపొందించు కోవాలని సూచించారు.విద్యార్థులు చదువు, ఆటలతో పాటు విజ్ఞాన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. పాఠశా లకు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ఇంట్లో ఖాళీగా ఉండకుండా వారిని తల్లిదండ్రులు గ్రంథాలయాలకు తప్పక పంపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మెంబర్స్ కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ తాజుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన అధికారులు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె - పెనుమూడి రహదారి మార్గంలో ఇటీవల నూతనంగా మున్సిపల్ పాలకులు నిర్మించిన రాణి సత్రం ఎదుట చాలా రోజులుగా చెత్త కుప్పలు పేరుకుపోయి ఉండటంతో స్థాని కులు చెత్తను నిప్పంటించి తగలబెడు తున్నారు. అనేకమార్లు మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అధికారులకు తెలియజేసినప్పటికీ రాణి సత్రం ఎదుట పేరుకుపోయి ఉన్న చెత్తను తొలగించడంలో ఆలస్యం జరగడంతో ఆయా వార్డులోని స్థానికులే చెత్తకుప్పలను తగలబెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ఈ రహదారి మార్గంలో వందలాది వాహ నాలు పాదచారులు నడిచి వెళుతూ ఉంటా రు. పెద్ద పదార్థాల నుండి చెత్త నుండి విపరీతమైన దుర్గంధం వెదజల్లుతూ ఉండటంతో మున్సిపల్ అధికారులకు చెప్పి నప్పటికీ పట్టించుకోకపోవడంతో స్థానికులే వ్యర్థాలను చెత్తను తగలబెట్టి తొలగించే చర్యలు చేపట్టడం హర్షనీయంఅనే వార్త గురువారం ఆరవ తేదీన జిల్లా ఎడిషన్‌లోని 8వ పేజీలో ప్రచురించడంతో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ సురేంద్ర స్పందించి శానిటరీ వర్కర్లచే అక్కడ నిల్వ ఉన్న చెత్తను డాక్టర్ల ద్వారా బయటకు తరలించి బ్లీచింగ్ సున్నం చల్లి శుభ్రపరిచారు. దీంతో ఆ ఏరియా ప్రజలు విశాలాంధ్రకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు గ్రిల్స్‌ను ఢీకొన్న ఆటో- మహిళకు గాయాలు

విశాలాంధ్ర - అద్దంకి : రోడ్డు గ్రిల్స్‌ను ఆటో ఢీకొని మహిళకు గాయాలైన సంఘటన పట్టణంలోని రామ్ నగర్ వద్ద గురువారం జరిగింది. మండలంలోని కలవ కూరు గ్రామానికి చెందిన కుంచాల శ్రీను రమణ భార్యాభర్తలు ఇరువురు గురువారం ఉదయం సొంత ఆటోలో ఉలవపాడు వెళ్లి మామిడికాయలు అమ్మకానికి తీసుకొస్తుండగా ఆటో అదుపుతప్పి అద్దంక రామ్ నగర్ వద్ద రోడ్డు మార్జిన్లో ఉన్న గ్రిల్స్ ను ఢీకొనడంతో ఆటోలో ఉన్న భార్యాభర్తలు ఇరువురు కింద పడటంతో రమణ తలకు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది చికిత్స కోసం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు.

మజ్జిగ పంపిణీ కొనసాగింపు

విశాలాంధ్ర-పర్చూరు: స్థానిక బొమ్మల సెంటర్ వద్ద రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ కొనసాగుతుంది. పర్చూరులోని భాను ప్రసన్న ట్రేడర్స్ యజమాని, దేవరపల్లి గ్రామానికి చెందిన దొప్పలపూడి శేషు బాబు, రామాంజమ్మ దంపతులు, కుమార్తె హేమ, కుమారుడు భాను ప్రసన్న సహకారంతో మజ్జిగ పంపిణీ జరిగింది. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు తోకల కృష్ణమోహన్, గడ్డిపాటి శ్రీనివాసరావు, పాతోలు వెంకన్న ఉన్నారు.

పిల్లర్లకే పరిమితమైన అగ్నిమాపక భవనం

విశాలాంధ్ర - రేపల్లె : అగ్నిమాపక కేంద్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లా అధికారులు మంజూరు చేసిన నిధులతో నూతన భవన నిర్మాణ పనులు ఆదిలోనే హంసపాదుగా మిగిలి పోయింది . ఇప్పటికి రెండుసార్లు కాంట్రాక్టర్లు పనులు ప్రా రంభించడం మధ్యలోనే నిలిపివేయడంతో భవనం నిర్మాణం పనులు పిల్లర్లకే పరిమితమై అసంపూర్తిగా గత రెండు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండిపోయాయి నిర్మాణా నికి సంబంధించిన మెటీరియల్ ఇతర సామాగ్రి ఇనుప సువ్వలు తుప్పు పట్టి భవన నిర్మాణానికి పనికి రాకుండా పాడైపోయి ఉన్నాయి. నిర్మాణ పనులు ప్రారంభించడం మధ్యలో నిలిపివేయటంతో రేపల్లె అగ్నిమా పక కేంద్ర భవనానికి నూతన భవనం నిర్మా ణం పూర్తి కాకుండా సంవత్సరాలు తరబడి పునాదులకే పరిమితమై దర్శనమిస్తున్నది. రాష్ట్ర ప్రకృతి విపత్తుల సంస్థ మంజూరు చేసిన నిధులు నిరుపయోగంగా మిగిలిపోయి తిరిగి మరల కొత్త టెండర్లు పిలిచి కొత్త కాంట్రాక్టర్లతో పనులు ప్రారంభించాల్సిన పరిస్థితి నెలకొంది, అసంపూర్తిగా ఉన్న రేపల్లె ఫైర్ స్టేషన్ భవన నిర్మాణ పనులు రానున్న కొత్త ప్రభుత్వంలో అయినా అగ్ని మాపక శాఖ జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించి భవన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - చీరాల : విద్యార్థుల జీవితం ప్రగతిబాట వేసేందుకు అపురూప సంపద గ్రంథాలయమని చీరాల మండల విద్యాశాఖ అధికారి పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభ గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చీరాల మండల విద్యాశాఖ అధికారి పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ చదువు మనిషి జీవితానికీ,జీవనానికీ వెలుగునిస్తుందన్నారు. మనిషికి ఎలా జీవనోపాధి కల్పించుకోవాలో,సంఘంలో గౌరవంగా ఎలా జీవించాలో నేర్పేది విద్యేనని అన్నారు. గ్రంథాలయాలు విద్యార్థుల విజ్ఞాన జాగృతి నేస్తాలని, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు దోహదపడతాయన్నారు.స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో గ్రంథాలయాలు మరింతగా పురోభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం వేసవి శిక్షణ తరగతులలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు డి ధనమ్మ, ఎంఈఓలు జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి, ఎస్.పాండు రంగారావు కె మోహన్,ఎంవి రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

అర్చన నేరెళ్ళకు డాక్టరేట్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం ఈమని గ్రామానికి చెందిన అర్చన నేరెళ్ల రీసెర్చ్ స్కాలర్‌కు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారని హిందూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్ములేషన్ అండ్ ఇవాల్యుయేషన్ ఆఫ్ ఓరల్ తిన ఫిలిమ్స్ ఆఫ్ సెలెక్టెడ్ ఎనాల్జిసిక్స్ బై క్యుబిడి'అనే అంశంపై డాక్టర్ ఎంవీ నాగభూషణం నేతృత్వంలో పరిశోధన చేసినందుకు ఏఎన్‌యూ వారు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఉచిత ఫ్యాబ్రిక్ డిజైనింగ్, పెయింటింగ్ శిక్షణ

విశాలాంధ్ర-పర్చూరు: రోటరీ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేది నుండి స్థానిక రోటరీ భవన్‌లో ఉచిత ఫ్యాబ్రిక్ డిజైనింగ్, పెయింటింగ్ శిక్షణా కార్యక్రమం జరుగుతుందని రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు ప్రకటనలో గురువారం తెలిపారు. శిక్షణా కాలం 15 రోజులు ఉంటుందని, అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9000500478 సంప్రదించాలని ఆయన కోరారు.

చంద్రబాబు, లోకేష్‌లను కలిసిన 'ఏలూరి'

విశాలాంధ్ర - మార్టూరు : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ లను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ అద్భుతమైన ఘనవిజయం సాధించ డం పట్ల అధినేతకు ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హ్యాట్రిక్ విజేతగా నిలిచిన ఎమ్మెల్యే ఏలూరిని అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం యువ నేత నారా లోకేషును కలిశారు. ఘన విజయం సాధించినందుకు ఇద్దరూ పరస్పరం అభినందించుకున్నారు. పర్చూరు నియోజకవర్గం చరిత్రను తిరగరాసి భారీ మెజారిటీలో రికార్డు బద్దలు చేయడం పట్ల లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా ఇరువురు ఆప్యాయంగా పలకరించుకున్నారు. బాపట్ల పార్లమెంటు పరిధిలో అన్ని స్థానాలలో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యువనేత లోకేష్ మాట్లాడుతూ అపార అనుభవం ముందుచూపుతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు. అనంతరం పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

వార్డుల్లో కమీషనర్ పర్యటన

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి పురపాలక సంఘం వార్డులలో తెనాలి మున్సిపల్ కమీషనర్ బి.శేషన్న గురువారం విస్తృతంగా పర్యటించారు. 37వ వార్డులో బస్టాండు వెనుక ఏరియాలో సైడు కాలువలలో శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలను వార్డు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారు అడిగిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. శానిటేషన్, కార్మికులకు సూచనలిస్తూ వార్డులలో ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కాలువలలో నీరు సక్రమంగా పారుదల అయ్యేవిధంగా కాలువలను శుభ్రపరచాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటరి అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఐటిఐ ఉద్యోగ మేళా

విశాలాంధ్ర-తెనాలి : నేడు (శుక్రవారం) గవర్నమెంట్ ఐటిఐ-తెనాలి ఆవరణలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు గవర్నమెంట్ ఐటిఐ, తెనాలి జిల్లా కన్వీనర్ మరియు ప్రిన్సిపాల్ రావి చిన్నవెంకటేశ్వర్లు తెలిపారు. దాదాపు 14 వస్త్ర పరిశ్రమల కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. అర్హతలు కలిగిన వారు తమ బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొనిరావలయును. గవర్నమెంట్ ఐటిఐ - తెనాలి ఆవరణలో ఉదయం 10.00 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావలెనని తెలిపారు. వివరాలకు 9014491772 సంప్రదించగలరు.

వేసవి చిత్రకళా శిబిరం

విశాలాంధ్ర- తెనాలి : స్థానిక గంగానమ్మపేటలోని ఆదర్శ్ స్కూల్‌లో ఆంధ్రా ప్యారిస్ ఆర్ట్ సొసైటి, ఆదర్శ్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి చిత్రకళా శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు ఎంతో శ్రద్ధతో చిత్రలేఖనం నేర్చుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జయశేఖర్ మాట్లాడుతూ గురువారం జరిగిన చిత్రలేఖనం పోటీలలో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారికి నచ్చిన రంగాలలో పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. చిత్రలేఖనం పోటీలలో సీనియర్స్ విభాగంలో కౌసిలి శ్రద్ధ ఈదర రుత్విక్, కౌసిలి, సహస్రలు విజయం సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు జయశేఖర్ అభినందనలు తెలుపుతూ క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో సాధించలేనిది ఏమీ లేదని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను మోటివేషన్ చేశారు.

తప్పు చేస్తే క్షమించండి:కోన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నా వల్ల నాకు తెలియకుండా ఏదైన తప్పు చేసి ఉంటే క్షమించాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ఆయన గృహంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో కోన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతి,భద్రతలు కాపాడిన ఎన్నికలు విజయవంతం కావడానికి కృషిచేసిన పోలీస్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కుటమి తరుపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన వేగేశన నరేంద్ర వర్మకు శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల జిల్లాను కాపాడుకుంటూ బాపట్ల పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని వేగేశనకు కోన సూచించారు. తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి నియోజకవర్గంలో ఉన్న వైఎస్ఆర్‌పీపీ నాయకులకి, కార్యకర్తలకు, అభిమానులకు నా ధన్యవాదములు తెలిపారు. మీడియా ప్రశ్నలపై స్పందిస్తూ 74 సంవత్సరాల వయస్సులో 23 సీట్లున్న చంద్రబాబు గెలిచినప్పుడు, 50 సంవత్సరాల లోపు 11 సీట్లున్న జగన్ మోహన్ రెడ్డి మరోసారి గెలవలేడా అని సమాధానం ఇచ్చారు. ఎన్నికల సమయంలో టిడిపి ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చుతుందో లేదో చూడాలని ఒక సంవత్సరం సమయం ఇచ్చి చూస్తామన్నారు. జగన్మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారులకు పంకాలు అందించిన బూటకపు హామీలు ఇచ్చిన చంద్రబాబును నమ్మి ప్రజలు ఓటు వేయటం బాధాకరం అన్నారు. ప్రజల తరుపున పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకి పెన్షన్, మహిళకి ఉచిత బస్ ప్రయాణం, 18 సంవత్సరాలు నిండిన మహిళలకి రూ.1500 జమ, సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్స్, ఇచ్చిన హామీలు నెరవేర్చలాన్నారు. ఎవరికి అయినా ఎలాంటి అవసరం వచ్చినా నేను అందరికీ అందుబాటులో ఉంటానని నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంటాయన్నారు. నాకు సహకరించిన మీడియా ప్రతినిధులకు అందరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుపైనే ముస్లింలకు నమ్మకం

- ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు షేక్.ఖాజావలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : టీడీపీ, బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ ఈ రాష్ట్రంలోని ముస్లింలు చంద్రబాబుపై ఉన్న నమ్మకంతోనే అత్యధిక సంఖ్యలో ముస్లింలు కూటమికి ఓటు వేశారని ముస్లిం హక్కుల పోరాట సమితి (ఎంహెచ్‌పీఎస్)రాష్ట్ర అధ్యక్షులు షేక్.ఖాజావలి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనార్టీలకు వ్యతిరేకంగా చేస్తున్న కార్యక్రమాలకు వ్యతిరేకంగా అనేక మైనార్టీ సంఘాలు ముఖ్యంగా ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఫారుక్ షిబ్లి తనపై రాష్ట్ర ప్రభుత్వం అనేక కేసులు పెట్టినప్పటికీ వాటికి లెక్క చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ముస్లింలను చైతన్యవంతులు చేయడానికి కృషి చేసినట్లు తెలిపారు. రాయలసీమలో ముస్లింలు టీడీపీకి మద్దతు ఇవ్వడంలో షిబ్లీ పాత్ర గణనీయంగా ఉందని, అదేవిధంగా ఎన్నికల సమయంలో గుంటూరు నగరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీ సంఘాల నాయకులను ఆహ్వానించి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి టీడీపీకి పని చేసే విధంగా కృషి చేశారని ఆయన అన్నారు. టీడీపీకి ముస్లింలు ఓటు వేయడంలో చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో పాటు మైనార్టీ సంఘాలు చేసిన కృషి కూడా ఎంతో ఉందన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ముస్లింలకు అనేక వాగ్దానాలను చేశారని, వాటి అమలుకు ముస్లిం సంఘాలు చంద్రబాబుపై ఒత్తిడి చేస్తూనే ఉంటాయని ఖాజావలి పేర్కొన్నారు. ముస్లింలు చంద్రబాబుకి అండగా నిలిచినందుకు బాబు కచ్చితంగా ముస్లింలకు న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. చంద్రబాబు తన మంత్రివర్గంలో ముస్లింలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు శాసనమండలిలో, రాజ్యసభలో కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంహెచ్‌పీఎస్ నాయకులు షేక్ కుదిరి, ఎస్ఎం భాషా, షేక్ షాకీర్, షేక్ యాసిన్ పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

- గ్రంథాలయ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రతి ఒక్కరూ గ్రంథాలయంలోని వివిధ పుస్తకాలను చదివి విజ్ఞానవంతులు కావాలని గుంటూరు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ కోరారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గత 23 రోజుల నుంచి స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయం నందు 'వేసవి విజ్ఞాన శిబిరం' నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని వివిధ యాక్టివిటీస్ చేశారు. కథలు చదవడం, చెప్పడం, పద్యాలు నేర్చుకుని చెప్పడం, డ్రాయింగ్ వేయడం, యోగా చేయడం తదితర యాక్టివిటీస్& చేశారు. వివిధ రంగు పేపర్లతో వివిధ రకాల పేపరు క్రాఫ్ట్స్ నేర్చుకుని పేపర్‌తో ఫ్లవర్ వాజ్‌లు, ఫ్లవర్స్, డెకరేషన్ వస్తువులు తయారు చేశారు. అదేవిధంగా శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరూ గ్రంథాలయంలో సభ్యులుగా చేరి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కోరారు. గ్రంథాలయంలో అందించే సేవలను సద్వినియోగ పరుచుకోవాలని పేర్కొన్నారు. పిల్లలందరూ గ్రంథాలయ సభ్యులుగా చేరి గ్రంథాలయంలోని కథలు, పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివి అనంతరం మార్చుకునే ప్రయత్నం చేయాలని గ్రంథాలయ అధికారి బి.శకుంతల కోరారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పి. కోటేశ్వరి, పి. సుధాకర్, సీహెచ్ లక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా ప్రభుత్వ స్కూల్ టీచర్ సురేష్ పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు గ్రంథాలయ కార్యదర్శి వి. సుబ్బరత్నమ్మ బహుమతులు అందజేశారు.

టీడీపీ ఎమ్మెల్యేలకు అభినందనలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ ఏడాది మే నెల 13న జరిగిన ఎన్నికల సమయంలో ఘన విజయం సాధించిన మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గంలో అఖండ మెజారిటీతో విజయ సాధించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకి కాపు గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షులు మిరియాల గోపి కుమార్ ఆధ్వర్యంలో కాపు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం కన్నవారితోటలో ఉన్న ఆయన స్వగృహంలో కన్నా లక్ష్మీనారాయణను కలిసి శాలువా..పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన గల్లా మాధవిని...గుంటూరు తూర్పు టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నసీర్ అహ్మద్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, టీడీపీ సాంస్కృతిక విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షులు పప్పుల దేవదాసు, కాపు నాయకులు మిరియాల ప్రసాదరావు, దేగల వెంకటేశ్వరరావు, గంటా పెద్దబ్బాయి, గంటా మౌనిక, చింతా రజని, చింతా వాసు, రామారావు, విస్సకోట శ్రీనివాసరావు, గట్టు కోటయ్య, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా చంద్ర రాజేశ్వరరావు జయంతి

విశాలాంధ్ర-పెదకాకాని : స్థానిక పెదకాకాని గ్రామ సీపీఐ పార్టీ కార్యాలయం నందు సీపీఐ అగ్రనేత, పోరాట యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్య నారాయణ మాట్లాడుతూ కామ్రేడ్ చంద్ర రాజేశ్వ రరావు జమీందారీ కుటుంబంలో జన్మించినప్పటికీ ఆనాటి భారత కమ్యూనిస్టు పార్టీ ఆశయాలను అందిపుచ్చుకొని ఆనాటి జమీందారీ వ్యవస్థ, పెత్తందారి వ్యవస్థలను ఎదిరించి తన ఆస్తులను సైతం ప్రజలకు పంచిపెట్టి సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై దున్నేవాడిదే భూమి..పండించే వాడే ఆసామి అనే నినాదంతో దేశవ్యాప్తంగా భూ పోరాటాలు కొనసాగించినట్లు తెలిపారు. పేదలకు పంట భూములు, బంజర భూములు, ఇళ్ల స్థలాలు పంచి ఇచ్చిన ఘనత ఆయనకే దక్కు తుందన్నారు. సీపీఐ చేసిన పోరాటాలలో భాగంగా రాజ భరణాలు రద్దు, బ్యాంకుల జాతీయం చేయ టం వంటివి సాధించటం జరిగిందన్నారు. గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, గొడ్డంటి రమణ కుమార్, గోపి, సుబ్బారావు, బొట్టు శ్రీనివాసరావు, ఆర్.మోజెస్, బాబు, దర్శి లింగారావు, గంగ పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి భారీ ఏర్పాట్లు

విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని ప్రాంతమైన అమరావతిలో నారా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 12న ప్రమాణ స్వీకారం జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌కి చెందిన ఓ ఈవెంట్స్ కంపెనీ సుమారు 50 లారీల మెటీరియల్ రాజధాని ప్రాంతానికి చేరుకుంది. సినీ దర్శకుడు బోయపాటి శ్రీను ఆధ్వర్యంలో స్టేజ్ ఏర్పాట్లు జరగనున్నాయి. అధికారంలోకి వస్తే ప్రమాణ స్వీకారం అమరావతిలో చేస్తానని చంద్రబాబు చెప్పిన విషయం తెలిసిందే.

'సూర్యోదయం' టెలిఫిలిం షూటింగ్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విద్య నేర్చుకోవడం ద్వారా అజ్ఞాన తిమిరాల నుంచి విజ్ఞాన కాంతులు తన టెలి ఫిలిమ్స్ ద్వారా చాటి చెబుతున్నట్లు టెలి ఫిలిమ్స్ కథా రచయిత, నిర్మాత, దర్శకుడు గన్నె నాగ వాసు దేవరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏటి అగ్రహారం రామిరెడ్డి నగర్‌లోని తన నివాసంలో విద్య ప్రాధాన్యతను తెలియజెప్పే 'సూర్యోదయం' టెలి ఫిలిం నిర్మాణం ప్రారంభమైంది. విశ్వ సంకీర్తన ఆచార్య తుర్లపాటి, శంభయాచార్య, జి వెంకటేశ్వరరావులు తొలి ముహూర్తపు షాటుకు క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ జడ్పీ డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా ఉంటూనే తన విద్యార్థుల చేత అనేక సామాజిక ప్రయోజత కార్యక్రమాలు ధైర్యంగా పాటలు పాడటం, నటించడం నేర్పించానన్నారు. పదవీ విరమణ అనంతరం తన పూర్వ విద్యార్థులకు నటనను నేర్పించి ప్రోత్సహిస్తూ వారి చేత పదికి పైగా షార్ట్ ఫిలిమ్స్ నిర్మించి 'నేషన్ బిల్డర్' అవార్డు అందుకున్నట్లు చెప్పారు. సూర్యోదయం షార్ట్ ఫిలిం కథ పరంగా మహిళల విద్యా ప్రాధాన్యతను గురించి తీస్తున్నట్లు తెలియజేశారు. చిత్రంలో వి.హనుమంతరావు, కె.మమత, సుకన్య, ఎన్.సత్యనారాయణ చారి, పి.హరినాథ్ బాబు, నాగవేణి, తదితర 30 మంది నటీనటులు నటిస్తున్నారన్నారు. పాటలు బి.శ్రీలక్ష్మి, ఎ.సుధారాణి, ఎడిటింగ్ కెవీ మల్లికార్జునాచారి, కెమెరా అశోక్‌బాబులు సహకరిస్తున్నట్లు వాసుదేవరావు వివరించారు.

రహదారి భద్రతపై ప్రత్యేక శిక్షణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రహదారి భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించే విధంగా ఎల్ఎల్ఆర్, డీఎల్ కోసం వచ్చే అభ్యర్థులకు రహదారి భద్రతపై రూపొందించిన లఘు చిత్రాలు, ట్రాఫిక్ నిబంధనలు, రహదారి ప్రమాదాల చిత్రాలు ప్రత్యేక స్క్రీన్‌పై ప్రదర్శించినట్లు గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్.కరీం పేర్కొన్నారు. గురువారం గుంటూరు ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'సేఫ్టీ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ సెంటర్'ను డీటీసీ షేక్.కరీం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎల్ఎల్ఆర్, డీఎల్ కోసం వచ్చే అభ్యర్థులు రహదారిపై సంపూర్ణ అవగాహన కల్పించడం, మోటార్ వాహన చట్టం మౌళిక సూత్రాలు వివరించడం..ట్రాఫిక్ సూచనలు తెలియజేయడం..చట్టాలను అతిక్రమిస్తే వాటికి విధించే జరిమానాలు, శిక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అభ్యర్థి కచ్చితంగా రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో కనీసం 30 నిమిషాలు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఆ తరువాత మాత్రమే అభ్యర్థి ఎల్ఎల్ఆర్, డీఎల్ పరీక్షకు మోటార్ వాహనాల తనిఖీ అధికారి అనుమతించాలన్నారు. అవగాహన శిక్షణకు హాజరుకాని అభ్యర్థికి ఎల్ఎల్ఆర్ లేక డీఎల్ జారి చేయబడదన్నారు. నగరంలో ప్రత్యేక తనఖీలు నిర్వ హించి రహదారి భద్రత నిబంధ నలను ఉల్లంఘించే వాహనదా రులకు తప్పనిసరిగా రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. విశాఖపట్నం, విజయ వాడ ఆర్టీఓ కార్యాలయంలో మాత్రమే ఈ సదుపాయం ఉందని ఉప రవాణా కమిషనర్ షేక్.కరీం వెల్లడించారు.

చరిత్ర సృష్టించిన నారాలోకేష్

- నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ 91,447 ఓట్ల మెజార్టీతో సరికొత్త చరిత్రను సృష్టించారని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గానికి చెందిన మూడు పార్టీల నాయకులు మీడియా సమావేశం నిర్వహించి సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో నారా లోకేష్‌ను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో ఇంత ఘన విజయాన్ని సాధించామన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చరిత్రనే తిరగరాసిందన్నారు. ఇది ప్రజా విజయమన్నారు. ఎన్డీయేతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని గుర్తించి ప్రజలు ఓట్లు వేశారని, వారి నమ్మకాన్ని నిలబెడతామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసం, అరాచకం తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. అందుకే జగన్ ప్రతి పక్ష హోదా కూడా కోల్పోయారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ జనసేన ఇంఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంచికి, చెడుకి జరిగిన యుద్ధంలో ప్రజలు మంచి వైపు నిలబడ్డారన్నారు. రాష్ట్ర చరిత్రలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 164 సీట్లలో అఖండ విజయం సాధించడం ఒక రికార్డు అని అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ తుగ్లక్ పాలనలో ప్రజలు విసుగు చెందారని, అందుకే తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్ (చిన్న), మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షులు దామర్ల రాజు, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలుతోనే ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు

- అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రామారావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మానవాళికి ఆక్సిజన్ అందించే మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తూ పెంచడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ వై. రామారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో రామన్నపేటలో ఉన్న జనచైతన్య వేదిక సమావేశ మందిరంలో 'అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవంపై చర్చా గోష్టి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అకారణంగా చెట్లను నరికి వేసే వాళ్ళకి అపరాధ రుసుం విధించడం జరుగుతుందని హెచ్చరించారు. కేబుల్, మంచినీటి సరఫరా పైపులు, విద్యుత్ స్తంభాల పనుల నిమిత్తం మొక్కలకు హాని కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంట్ రోడ్లకి, డ్రైనేజీకి మధ్య కొంతమేర ఖాళీ ప్రదేశం ఉంచితేనే వర్షపు నీరు అందులోకి ఇంకి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని అన్నారు. విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త వై. రత్తయ్య మాట్లాడుతూ కార్బన్ డై ఆక్సైడ్ గ్లోబల్ వార్మింగ్‌కి ముఖ్య కారణమన్నారు. ప్రతి చెట్టు ఓ ఆక్సిజన్ ఫ్యాక్టరీ అని, ప్రాణ వాయువుని విరివిగా అందించే రావి చెట్టుని నాటాలని సూచించారు. మానవత ముఖ్య సలహాదారు వి. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ అధికారులు, కమిటీగా ఏర్పడి గుంటూరు నగరాన్ని హరిత నగరంగా మార్చడానికి కృషి చేద్దామన్నారు. కల్లూరి మురళీధర్ మాట్లాడుతూ పురుగు మందులు వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలని, మిద్దె తోటలను ప్రోత్సహించాలని సూచించారు. సామాజిక సేవా తత్పరులు యార్లగడ్డ చౌదరి మాట్లాడుతూ మనకి మార్కెట్లో దొరికే కూరగాయలు, ఆకు కూరలు విషాహారంతో సమానమని, ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలోనే వీటిని పండించుకోవాలని సూచించారు. ఎండి రాలిన ఆకులను కాల్చకుండా వాటిని మొక్కలకు ఎరువుగా వాడాలని సూచించారు. విచ్చేసిన ముఖ్య, విశిష్ట అతిథులను మానవత చైర్మన్ పావులూరి రమేష్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ పి.విమల కుమారి, కార్యదర్శి వల్లె సుబ్రహ్మణ్యం, కోశాధికారి టీవీ సాయిరాం, డైరెక్టర్ ఉప్పల సాంబశివరావు, తుమాటి ఉమా మహేశ్వరరావు, సదా శివరావు, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో చెట్లు తొలగింపు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండల కేంద్రమైన యద్దనపూడి స్మశాన వాటిక లో చిల్ల చెట్లు తొలగింపుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వీకారం చుట్టారు. స్మశానం నిండా తుమ్మ చెట్లు చిల్ల చెట్లు దట్టంగా ఉండటంతో ప్రొక్లెయిన్ సహాయంతో పూర్తిగా తొలగించారు. గత ఐదు సంవత్సరాల నుంచి పట్టించుకున్న నాధుడే కరువైనందున ఎవరైనా మరణించినప్పుడు గ్రామస్తులు ఇబ్బందులను గమనించిన కనపర్తి అభివృద్ధి శ్రీకారం చుట్టాడు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, కొండల రాయుడు, సతీష్, పటాన్ మస్తాన్ వలి , పి. సుధాకర్ ,సుభాని, అనుక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

విశాలాంధ్ర - చీరాల : ఉన్నత విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని డాక్టర్ హైమ సుబ్బారావు అన్నారు.గురువారం చీరాల హేమ హాస్పటల్ ఆవరణలో మేడ నందినికి ల్యాప్ టాప్ బహుమతిగా అందించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యతో ఉన్నతంగా ఎదగాలని ప్రోత్సహించిన హైమా సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థి దశలో ఇష్టపడి చదివితేనే జీవితంలో అనుకున్న లక్ష్యం చేరుకోగలరన్నారు.ప్రతి విద్యార్థి జీవితానికి లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని ఆ లక్ష్యం సాధించే దిశగా ప్రయత్నం చేయాలని సూచించారు.

'పోపూరి'కి పితృవియోగం

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలోని ఇనగల్లు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పోపూరి శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పోపూరిని ఫోను ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి తీరని లోటుని ఏలూరి తెలిపారు.

'గురుకుల్లో' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - నిజాంపట్నం : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఆరు మహాత్మ జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6 నుండి 9 తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.నాగమల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నిజాంపట్నం బీసీ (బాలురు) గురుకుల పాఠశాలలో 6, 7 తరగతులకు స్టేట్ సిలబస్, 8, 9 తరగతులకు సీబీఎస్ఈ సిలబస్, మిగిలిన నక్షత్ర నగర్ (బాలికలు), సత్తెనపల్లి (బాలికలు), నరసరావుపేట (బాలికలు), గురజాల (బాలికలు), వినుకొండ (బాలురు) గురుకుల పాఠశాల లలో స్టేట్ సిలబస్ ఇంగ్లీష్ మీడియంలో 6 నుండి 9 తరగతు లలో మిగిలిన ఖాళీలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు కుటుంబ వార్షిక ఆదాయం రూ.1 లక్ష రూపాయలకు మించరాదని చెప్పారు.ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15 వ తేది లోపు https://mjpap bcwreis. apcfss.in లో వెబ్ సైట్లో రూ.100 రూపాయలు చెల్లించి పాస్ ఫోటో, ఆధార్ తో దరఖాస్తు చేసుకోవాలన్నారు.20 వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుండి 5.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అపరకర్మలకు రేపల్లె ఓల్డ్ టౌన్ రాణి సత్రం సిద్ధం

విశాలాంధ్ర - రేపల్లె : రాచూరు జమీందారు ఆధ్వర్యంలో రేపల్లె మున్సిపాలిటీ నిర్వహిస్తున్న రేపల్లె - పెనుమూడి రహదారి మార్గంలో ఇటీవల నూతనంగా సుమారు మూడు లక్షల 75 వేల రూపా యలతో ఆధునిక వసతులతో నిర్మించిన అపారకర్మల రాణి సత్రం భవనం రేపల్లె పట్టణ పరిసర ప్రాంత అన్ని వర్గాల ప్రజలకు అందుబా టులోకి రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా అద్దె ఇళ్లల్లో ఉంటున్న కుటుంబాల వారు వారికి సంబంధించిన కుటుంబ సభ్యులు చనిపోయినప్పుడు అపరకర్మకాండలు చేసుకొనుటకు సరైన వసతులతో కూడిన భవనాలు లేక పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతూ సమస్యలకు గురవుతూ ఉండేవారు. పట్టణంలో రాణి సత్రం గతంలో పాత బిల్డింగ్ లో ఉన్నప్పుడు అపరకర్మ కాండ లు నిర్వహించుకుని దశ దిన కర్మలు పూర్తయ్యే వరకు ఆ సత్రంలోని మూడు రోజులపాటు బస చేసేవారు. నాలుగు సంవత్సరాల క్రితం పాడుబడిపోయిన రాణి సత్రాన్ని తొలగించి దాని స్థానంలో ఇటీవల కొత్త భవనాన్ని మున్సిపల్ అధికారులు నిర్మించారు. దీంతో రాణి సత్రం ఆపార కర్మకాండల భవనంగా నామకరణం చేసి ఇటీవల రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణా రావు, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు ,మున్సిపల్ చైర్మన్ కట్ట మంగ, వైస్ చైర్మన్లు ప్రశాంత్ కుమార్ ,విశ్వనాథ్ గుప్తా, ఇతర ప్రజా ప్రతినిధులు పలు ,వైసీపీ నాయకులు

ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఈ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ అద్దె ఇళ్లల్లో ఉండి ఇబ్బందులు పడేవారు ఇకపై పడకుండా ఉండే విధంగా ఈ సత్రం అన్ని సౌకర్యాలతో ఉపయోగంలోకి రావడం పట్ల పట్టణ ప్రజలు ముఖ్యంగా అద్దె ఇళ్లల్లో ఉండే వారు హర్షం వ్యక్తం చేస్తూ ఉన్నారు. ప్రత్యేకంగా ఫంక్షన్లు, సభలు, సమావేశాలు ర్వహించు కునేందుకు వీలుగా గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించారు.అదేవిధంగా పై అంతస్తులు ఆరు షాపులను గదులుగా నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రాణి సత్రాన్ని తీర్చిదిద్దారు.

చంద్రన్న పాలనలో స్వర్ణ యుగం

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - బల్లికురవ : గతంలో కనీవిని ఎరుగని రీతిలో భారీ మెజారిటీతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విజయం సాధించడంతో టీడీపీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున చిలకలూరిపేటలోని గొట్టిపాటి నివాసానికి తరలివచ్చారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను పూలమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే గొట్టిపాటి మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామన్నారు.ప్రజలందరి ఆశలు ఆకాంక్షలు కనుగుణంగా తెలుగుదేశం ప్రభుత్వం పాలన కొనసాగుతుందన్నారు.సమస్యల పరిష్కారం లక్ష్యంగా కృషిచేస్తానన్నారు.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాపాలన సాగిస్తామన్నారు.ఇంతటి ఘన విజయాన్ని భారీ మెజారిటీని అందించిన అద్దంకి నియోజకవర్గ ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి శుభాభినందనలు తెలిపారు.ఈ విజయం ప్రజలందరి విజయంగా గొట్టిపాటి అభివర్ణించారు.

షిర్డీ సాయిబాబా 13వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో 13వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయి సంకీర్తనలు, హారతి అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పొగడదొండ హరిబాబు, లొల్ల ఇందిరా దేవి, రమాదేవి, కుచల కుమారి, కాశీ విశ్వనాథ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీల్లో 46 మంది నేరచరితులు

విశాలాంధ్ర - బాపట్ల : లోక్‌సభకు నూతనంగా ఎన్నికైన ఎంపీలలో 46 శాతం మంది నేరచరితులుగా ఉన్నారని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పీసీ సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేరచరితులుగా ఉన్న 46 శాతం ఎంపీల్లో 31 శాతం మంది తీవ్రమైన నేరారోపణలను ఎదుర్కొంటున్నారన్నారు. ఎంపీల నేర చరిత్ర 2009వ సంవత్సరం నుండి క్రమేపి పెరుగుతూ వస్తుందని 2009లో 30 శాతం మంది ఎంపీలు నేరచరితులుగా ఉంటే, 2014లో 34 శాతం మంది నేరచరితులు ఉన్నారన్నారు. 2019లో ఈ శాతం 43 కి పెరిగితే, ప్రస్తుతం 2024లో 46 శాతానికి పెరగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం అన్నారు. బీజేపీ ఎంపీలలో 39 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉండగా, కాంగ్రెస్ ఎంపీలలో 49 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారన్నారు. టిడిపి ఎంపీలలో 50 శాతం మంది వైయస్సార్సీపి ఎంపీల్లో 25 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారన్నారు. నూతన ఎంపీలలో 93 శాతం మంది కోటీశ్వరులు ఉన్నారని వీరి సగటు ఆస్తి విలువ రు.46.34 కోట్లుగా ఉందన్నారు. 2009లో 58 శాతం మంది కోటీశ్వరులు ఉండగా అది 2014లో 82 శాతానికి పెరిగిందన్నారు. 2019లో 88 శాతానికి పెరగగా, 2024లో కోటీశ్వరుల సంఖ్య 93 శాతం అయ్యిందన్నారు. బిజెపి ఎంపీలలో 95 శాతం మంది కోటీశ్వరులు కాగా, కాంగ్రెస్ ఎంపీలలో 93 శాతం మంది కోటీశ్వరులు ఉన్నారన్నారు. టిడిపి ఎంపీలలో నూటికి నూరు శాతం మంది కోటీశ్వరులు అని పీసీ సాయిబాబు తెలిపారు.

నరేంద్రవర్మకు చంద్రబాబు అభినందన

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల నియోజక వర్గంలో రెండు దశాబ్దాలుగా టీడీపీ జెండా ఎగరక పోయిన ఈ సారి ఎలాగైనా గెలవాలని నా ఆలోచ నకు నీవు చూపిన తెగువ చేసిన కృషి శభాష్ అంటూ బాపట్ల ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగేశన నరేంద్ర వర్మకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అభినందనలు తెలిపారు. చంద్రబాబును ఉండవల్లిలో వేగేశన గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాపట్లలో ప్రజలు మంచిగా ఆదరించి ఘన విజయాన్ని అందించారని వేగేశన తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో
పికెట్స్ ఫ్లాగ్‌మార్చ్

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసినప్పటికీ సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలపై నిఘా కొనసాగిస్తున్నామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం జిల్లాలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తుగా నిలువరించాలనే ముఖ్య ఉద్దేశంతో బాపట్ల రూరల్ సీఐ బి.హజరత్ బాబు ఆధ్వర్యంలో కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తనందాయపాలెం, ఏట్రవారిపాలెం గ్రామాలలో, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈతేరు, తూర్పు పిన్నిబోయినవారిపాలెం, వెస్ట్ పిన్నిబోయినవారి పాలెం గ్రామాలలో ఇన్‌స్పెక్టర్ వై.శ్రీహరి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, బి.ఎస్.ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అంతే కాకుండా సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పికెట్స్ నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం ఆ ప్రాంతాలలో స్థానిక పోలీసులు, బి.ఎస్.ఎఫ్ బలగాలతో పికెట్స్ ఏర్పాటు చేశామన్నారు.